సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 4 । డిసెంబర్ । 2024



సోమశిలలో 70.631 టీఎంసీలు

ఆత్మకూరు: జలాశయంలో మంగళవారానికి 70.631 టీఎంసీలు ఉన్నాయి. 9,467 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, డెల్టాకు 50, ఉత్తరకాలువకు 150, దక్షిణకాలువకు 600, కండలేరుకు 2 వేల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.78,700
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,130
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,344
సవర (8 గ్రాములు)	రూ.58,752

గరిష్టం/కనిష్టం
29.0 /24.5

వాతావరణం

జిల్లాలో బుధవారం అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తరు నుంచి తేలిక పాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. మంగళవారం గాలిలో తేమ 100 శాతం ఉంది.

న్యూస్‌రీల్

ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా చర్యలు

- కలెక్టర్ ఆనంద్



ప్రిన్సిపల్స్ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్

నెల్లూరురూరల్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు కృషి చేయాలని కలెక్టర్ ఆనంద్ చెప్పారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ తన చాంబర్‌లో జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో త్రైమాసిక పరీక్షల ఫలితాలపై ప్రిన్సిపల్స్‌తో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ త్రైమాసిక పరీక్షల ఫలితాల్లో కొన్ని ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం బాగా తగ్గిందని, రానున్న అన్ని పరీక్షల్లో కూడా ఈ శాతాన్ని పెంచేందుకు అధ్యాపకులు చర్యలు చేపట్టాలన్నారు. ప్రధానంగా విద్యార్థులు ప్రతి రోజు కళాశాలకు వచ్చేలా, రాని విద్యార్థుల వివరాలు సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడాలన్నారు. కళాశాలల్లో స్టడీ అవర్స్ ఎక్కువగా నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్ఐఓ శ్రీనివాసులు, డీవీఈఓ మధుబాబు, జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

డీఎల్‌ఈడీ ఫలితాల విడుదల

నెల్లూరు (టౌన్): డీఎల్‌ఈడీ ఫస్టియర్ సప్లిమెంటరీ పరీక్ష ఫలితాలు విడుదలైనట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల మార్కుల జాబితాలను ప్రభుత్వ పరీక్షల విభాగం అధికారిక వెబ్‌సైట్ www.bse.ap.gov.inలో ఉంచినట్లు చెప్పారు. ఈ ఫలితాలకు సంబంధించి రీకౌంటింగ్‌కు దరఖాస్తు చేయదలచిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీ లోపు వారి దరఖాస్తు, చలానాను నేరుగా ప్రభుత్వ పరీక్షల విభాగానికి పంపాలన్నారు. ఒక సబ్జెక్టుకు ఫీజురూ.500 వంతున చలానా సీఎఫ్ఎంఎస్ ద్వారానే చెల్లించాలన్నారు.

కప్పం కడితే.. గ్రానైట్‌కు.. రైట్‌రైట్

అక్రమ రవాణాకు రూ.లక్షల్లో ఎంవీఐ డిమాండ్

- ఆర్టీఏ అధికారి దందాపై గ్రానైట్ వ్యాపారులు పోలీస్ బాస్‌కు ఫిర్యాదు
- విచారణకు గత ఒంగోలు ఎస్పీకి ఆదేశాలు
- నివేదిక ఇవ్వాలని నెల్లూరు డీటీసీని కోరిన అప్పటి ఒంగోలు ఎస్పీ
- నేటికీ చర్యలు తీసుకోకపోవడంతో తాజాగా రవాణాశాఖ మంత్రికి ఫిర్యాదు

జిల్లా రవాణా శాఖలో కొంతమంది అధికారులు యథేచ్ఛగా అవినీతికి పాల్పడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. రాష్ట్రంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాతోపాటు తెలంగాణ రాష్ట్రం నుంచి గ్రానైట్ జిల్లాలోని కృష్ణపట్నం పోర్టు ద్వారా విదేశాలకు ఎగుమతి జరుగుతోంది. ప్రకాశం జిల్లా నుంచి అక్రమంగా జరుగుతున్న గ్రానైట్ రవాణాను రవాణాశాఖాధికారులు ఆదాయవనరుగా మార్చుకుంటున్నారు. ఇందుకు నెలకు రూ.లక్షల్లో ముడుపులు ఇవ్వాలని ఓ అధికారి డిమాండ్ చేస్తూ.. ఇబ్బందులకు గురి చేస్తుండడంతో సదరు అధికారిపై గ్రానైట్ వ్యాపారులు తాజాగా రవాణాశాఖ మంత్రికి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం ఆ శాఖలో కలకలం సృష్టిస్తోంది.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: కృష్ణపట్నం పోర్టు ద్వారా గ్రానైట్ ఎగుమతులు సవ్యంగా జరగాలంటే.. నెలకు రూ.కోటి ఇవ్వాలంట. ప్రకాశం జిల్లా నుంచి గ్రానైట్ వాహనాలు జిల్లా పరిధిలో హైవే మీదుగా కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు వెళ్తున్నాయి. వీటిలో ఎక్కువగా అధికలోడు, ట్యాక్స్ చెల్లించని వాహనాలే ఉంటాయి. అయితే అటువంటి వాహనాలపై చట్టబద్ధంగా చర్యలు తీసుకోవాల్సిన రవాణాశాఖ అధికారులు దీన్ని ఆదాయ వనరుగా మార్చుకునేందుకు ఏకంగా దందానే చేస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అధిక లోడు.. జీరో ట్యాక్స్ దందా


ఉమ్మడి ప్రకాశం జిల్లా చీమకుర్తి, బల్లికురవ, ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గురిజేపల్లి నుంచి రోజుకు పదుల సంఖ్యలో కృష్ణపట్నం, చెన్నై పోర్టులకు గ్రానైట్ వాహనాలు వస్తుంటాయి. అయితే సేల్స్ ట్యాక్స్, మైనింగ్ ట్యాక్స్‌లు చెల్లించకుండా జీరో బిల్లులతో ఆ వాహనాల్లో పరిమితికి మించి అధిక లోడుతో రవాణా చేస్తుంటారు. ఈ వాహనాలపై కేసులు నమోదు చేస్తే రవాణా శాఖకు రూ.లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు సేల్స్ ట్యాక్స్, మైనింగ్ పర్మిట్‌లు పక్కన పెడితే అధిక లోడుతో వెళ్లే వాహనాన్ని ఆర్టీఏ అధికారి తనిఖీ చేస్తే పరిమితికి మించి 10 టన్నులు అధిక లోడు ఉన్నట్లయితే ఇందుకు రూ.20 వేలు జరిమానా, ప్రతి టన్నుకు రూ.2 వేలు లెక్కన 10 టన్నులకు కలిపి రూ.20 వేలు కలిపి మొత్తం రూ.40



వేలు అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. దీంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ లేకుంటే రూ.5 వేలు. పర్మిట్ లేకుంటే మరో రూ.5 వేలు ఈ లెక్కన మరో రూ.10 వేల నుంచి రూ.12 వేలు జరిమానా విధించే అవకాశం ఉంటుంది. దీంతో కొంత మంది వాహన యజమానులు నెలవారీ మామూళ్లు మాట్లాడుకుని దర్జాగా తిప్పుతున్నారు. నెల వారీ చెల్లింపులు లేని వారు వాహన యజమానులు సదరు అధికారులకు ఎంతో కొంత ముట్టజెప్పి వెళుతున్న పరిస్థితి. ఈ లెక్కన నెల వ్యవధిలో లక్షల రూపాయలు లావాదేవీలు జరుగుతుంటాయి.

చక్రం తిప్పుతున్న ఎంవీఐ

కొంతమంది వాహన యజమానుల వద్ద నుంచి నెలవారీ మామూళ్లు తీసుకుని వాటిని వదిలి వేసి మిగిలిన వారి వాహనాలపై కేసులు నమోదు చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ప్రధానంగా గ్రానైట్ వాహనాల వసూళ్లలో రవాణా శాఖలో పనిచేస్తున్న ఎంవీఐ బాలమురళీ చక్రం తిప్పుతున్నట్లు చెబుతున్నారు. ఈయనే మొత్తం వసూళ్లు వ్యవహారాన్ని చూస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఏడాది క్రితం రాష్ట్ర పోలీసు బాస్‌కు కొంత మంది ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ ఫిర్యాదుపై చర్యలు తీసుకోవాలని అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ మల్లికాగార్గ్‌ను ఆదేశించారు. ఈ మేరకు నెల్లూరు డీటీసీని విచారణ చేసి, సంబంధిత బాధ్యులపై చర్యలకు ప్రతిపాదించాలని సూచించారు. ఈ లోపు ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఆ ఫిర్యాదు మరుగున పడిపోయింది. ఈ లోపు కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. అయితే గ్రానైట్ యజమానులపై మాత్రం రవాణాశాఖ అధికారి కక్ష కట్టి మరింత ఒత్తిడి చేస్తుండడంతో తాజాగా ఆ శాఖ మంత్రికి ఫిర్యాదు చేయడంతో ఈ విషయం మరోసారి చర్చనీయాంశమైంది.



మంత్రికి గ్రానైట్ వ్యాపారులు రాసిన లేఖ

నివేదిక అప్పుడే పంపించాం

జిల్లాలో పనిచేస్తున్న కొంతమంది అధికారులపై ప్రకాశం జిల్లాకు చెందిన కొందరు వ్యక్తులు పోలీసుశాఖకు ఫిర్యాదు చేశారు. అక్కడ పనిచేస్తున్న ఎస్పీ మల్లికాగార్గ్ తనకు ఆ ఫిర్యాదును పంపించారు. అవినీతి విషయంపై విచారణ జరిపాం. ఫిర్యాదుదారుడు సెల్‌కు ఫోన్ చేస్తే ఆ నంబరు పనిచేయడం లేదు. ప్రకాశం జిల్లా గ్రానైట్ వాహన యజమానులను పిలిచి వారిని విచారించాం. వారి నుంచి సంతకాలతో స్టేట్‌మెంట్లను తీసుకున్నాం. మమ్మల్ని ఏ అధికారి బెదిరించలేదని, డబ్బులు అడగలేదని స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఈ ఫిర్యాదుకు సంబంధించి నివేదికను అప్పట్లోనే రాష్ట్ర రవాణాశాఖ ఉన్నతాధికారులకు కూడా పంపించాం. విచారించ లేదని చెప్పడం వాస్తవం కాదు. మా దగ్గర అన్ని అన్ని ఆధారాలు ఉన్నాయి. – బి.చందర్, డీటీసీ

రైల్వే ట్రేడ్ యూనియన్ ఎన్నికలు నేడు

బిట్రగుంట: దక్షిణ మధ్య రైల్వేలో ట్రేడ్ యూనియన్ ఎన్నికలు బుధవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకూ జరగనున్నాయి. ఈ ఎన్నికలకు సంబంధించి బిట్రగుంట రైల్వేస్టేషన్‌లో బూత్ నంబర్ 15 కేటాయించారు. బిట్రగుంటలో సుమారు 850 మంది కార్మికులకు ఓటు హక్కు ఉండగా, ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల్లోపు తమ ఓటు హక్కు వినియోగించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికల సందర్భంగా పాటించాల్సిన నిబంధనలు, విధి విధానాలపై యూనియన్ నాయకులకు ఆర్పీఎఫ్ ఎస్సై మహేంద్రబాబు అవగాహన కల్పించారు. నిబంధనల మేరకు ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు.

ఏసీబీ వలలో ముత్తుకూరు తహసీల్దార్

- రైతు నుంచి రూ.25 వేల లంచం తీసుకుంటూ పట్టుబడి
- ఏసీబీ డీఎస్పీ శిరీష వెల్లడి



మాట్లాడుతున్న డీఎస్పీ శిరీష



లంచం సొమ్ముతో పట్టుబడిన తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి

ముత్తుకూరు: ముత్తుకూరు తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి మంగళవారం ఒక రైతు నుంచి రూ.25 వేలు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీకి పట్టుబడ్డాడు. ఏసీబీ డీఎస్పీ శిరీష కథనం మేరకు.. మండలంలోని పంటపాళెం గ్రామానికి చెందిన వడ్లమూడి వెంకటరమణయ్య అనే రైతు తల్లి కాంతమ్మ పేరుతో కొంత పొలం ఉంది. ఈ భూమికి సంబంధించిన అడంగళ్‌లో ఖాతా నంబరుకు బదులు నోషనల్ నంబర్ నమోదైంది. దీన్ని సరిచేసి అడంగళ్, పాస్ బుక్ ఇవ్వాలంటూ ఆమె కొడుకు వడ్లమూడి వెంకట రమణయ్య కొద్ది రోజులుగా తహసీల్దార్ బాలకృష్ణారెడ్డిని కోరుతున్నారు. ఇందుకోసం తహసీల్దార్ రూ.25,000 డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బాధితుడు వెంకటరమణయ్య ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు వెంకటరమణయ్య మంగళవారం తహసీల్దార్ బాలకృష్ణారెడ్డికి లంచం ఇస్తుండగా డీఎస్పీ శిరీష ఆధ్వర్యంలో ఏసీబీ సిబ్బంది రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొన్నారు. నగదును స్వాధీనం చేసుకుని రసాయన పరీక్షలు నిర్వహించారు. ఆయన్ను అదుపులోకి తీసుకుని ఉదయం 11 నుంచి సాయంత్రం వరకు సుదీర్ఘంగా విచారించారు. పలు రికార్డులతో పాటు తహసీల్దార్ వాహనాన్ని కూడా తనిఖీ చేశారు. ఈ మేరకు ఆయన్ను కోర్టుకు హాజరుపరచనున్నట్లు తెలిపారు.



ఫిర్యాదుదారుడు వడ్లమూడి రమణయ్య

దత్తత మార్గం.. మాతృత్వ వరం

మారుతున్న జీవనశైలితో ఫెర్టిలిటీ సమస్యలు

- తల్లిదండ్రులు కావాలన్న కోరికతో కొందరు అడ్డదారుల్లో ప్రయత్నం
- అధికారికంగా దత్తత తీసుకునే అవకాశాల్లో ఆలస్యం, అవగాహన లోపం
- ప్రత్యామ్నాయంగా చిన్నారులను కొనుక్కొని చిక్కుల్లో పడుతున్న దంపతులు
- గతంలో నిబంధనలు కఠినతరం.. ఏళ్ల సమయం పట్టేది
- తాజాగా సరళీకృతంతో నెల రోజుల్లోనే దత్తతకు అవకాశం

అమ్మా, నాన్నలు కావాలనే కల.. కొందరి జీవితాల్లో కలగానే మిగిలిపోతోంది. ఆలస్యమవుతున్న వివాహాలు, గతి తప్పుతున్న హార్మోన్ల సమతుల్యత, మారుతున్న జీవనశైలి, ఒబెసిటీ వంటి అనేక కారణాలు ఫెర్టిలిటీ సమస్యలకు కారణమవుతున్నాయి. సంతానానికి నోచుకోని దంపతులు అనాథ బిడ్డల దత్తతకు మొగ్గు చూపుతున్నారు. అయితే ఈ ప్రక్రియలో ఉన్న కఠినమైన నిబంధనలతో ఏళ్ల తరబడి ఎదురుచూపులు చూడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమవుతున్నాయి. ప్రత్యామ్నాయంగా అడ్డదారుల్లో బిడ్డలను కొనుక్కొనే సమయంలో చిక్కుల్లో పడుతున్నారు. ఇలాంటి పరిస్థితులకు చెక్ పెడుతూ, ప్రభుత్వాలు దత్తత ప్రక్రియను సరళీకృతం చేశాయి.


అపహరించి.. అమ్మేసి..



తండ్రి చెంతకు చేరిన అపహరణకు గురైన చిన్నారి (ఫైల్)

ప్రకాశం జిల్లా పొన్నలూరుకు చెందిన సంతానం లేని దంపతులు తమకు ఎలాగైనా ఓ బిడ్డను తెచ్చివ్వమని కావలికి చెందిన ఒక మహిళను సంప్రదించారు. ఆమె తనకు బాగా తెలిసిన దంపతుల 15 నెలల బిడ్డను అపహరించింది. ఊయల్లో నిద్రపోతున్న బిడ్డ అపహరణకు గురికావడంతో సంచలనమైంది. దీంతో పోలీస్ యంత్రాంగం రంగంలోకి దిగి ఎట్టకేలకు మరుసటి రోజు సాయంత్రానికి చిన్నారితో సహా అపహరణకు పాల్పడిన మహిళను అదుపులోకి తీసుకున్నారు. ఆ చిన్నారిని తల్లి చెంతకు చేర్చారు. ఈ ఘటన ఈ ఏడాది అక్టోబర్ 28న కావలి టుటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి వెంగళరావునగర్‌లో జరిగింది.

పెంచుకోవాలన్న తాపత్రయంతో..



మూడు నెలల మగబిడ్డను తల్లిదండ్రుల అమ్మకాన్ని అడ్డుకున్న పోలీసులు (ఫైల్)

ప్రకాశం జిల్లా సింగరాయకొండ మండలం ఊళ్లపాలేనికి చెందిన దంపతులకు పెళ్లయి 20 ఏళ్లు అవుతున్నా పిల్లలు లేరని, ఒక బిడ్డను దత్తత తీసుకోవాలనే తాపత్రయంతో చాలా మందికి చెప్పాడు. సంచార జీవనం చేసే ఒక జంట కావలి పట్టణంలోని ముసునూరు అట్టల ఫ్యాక్టరీ ప్రాంతంలో ఓ చెట్టు నీడలో జీవనం సాగిస్తోంది. వీరికి 8 మంది సంతానం. డబ్బుల కోసం తమ మూడు నెలల మగ బిడ్డను రూ.1.10 లక్షలకు అమ్మేందుకు సిద్ధమయ్యారు. విషయం కావలి పోలీసులకు తెలియడంతో ఈ వ్యవహారం ఇక్కడితో ఆగిపోయింది. ఈ ఘటన నవంబర్ 6న జరిగింది.

కావలి: దాంపత్యం ఒక బంధం.. మాతృత్వం ఒక వరం. ఈ రోజుల్లో చాలా మందికి పెళ్లయి సంవత్సరాలు గడుస్తున్నా.. పిల్లలు పుట్టడం అనేది సమస్యగా మారుతోంది. ఏం చేసినా సంతాన భాగ్యం కలగట్లేదు. అమ్మా, నాన్నలు అనిపించుకోలేక చాలా మంది దంపతులు మనోవేదన చెందుతున్నారు. ఈ క్రమంలో అనాథ పిల్లల్ని దత్తత తీసుకునేందుకు నేటి తరం దంపతులు ఆసక్తి చూపిస్తున్నారు. ఈ ప్రక్రియ చట్టబద్ధంగా చేసుకునే వారికే న్యాయపరమైన గుర్తింపు లభిస్తోంది. తద్వారా భవిష్యత్‌లో ఎలాంటి ఇబ్బందులూ రాకుండా ఉంటాయి. అయితే దత్తత ప్రక్రియలో ఉన్న కఠినమైన నిబంధనలకు సిద్ధపడినా, బిడ్డలను దక్కించుకునేందుకు ఏళ్లతరబడి ఎదురుచూడాల్సిన పరిస్థితులు అనివార్యమవుతున్నాయి. ఈ క్రమంలో కొందరు ప్రత్యామ్నాయ ప్రయత్నాలు చేస్తూ చిక్కుల్లో పడుతున్నారు.



పిల్లల దత్తతపై కొత్త నిబంధనల వాల్ పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించిన కలెక్టర్ ఆనంద్ (ఫైల్)

ఆలస్యమవుతుందని..

ప్రభుత్వ సంరక్షణలో ఉన్న చిన్నారులను అక్కున చేర్చుకుందుకు చాలా మంది దరఖాస్తు చేసుకుంటున్నారు. అయితే ఇప్పటి వరకు దత్తతలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పేదరికం, వివాహేతర సంబంధం ద్వారా పుట్టిన బిడ్డలు, ఆడ పిల్ల అంటే ఇష్టం లేకపోవడం ఇలా కారణమేదైనా పలువురు నెలలు నిండని చిన్నారులను చెత్త కుప్పల పాల్జేస్తున్నారు. ఇటువంటి బిడ్డలతో పాటు కొన్ని సందర్భాల్లో అపహరణ ద్వారా కూడా చిన్నారులను కొనుక్కునేందుకు మరికొందరు దంపతులు ముందుకు వస్తున్నారు. అవగాహన లోపం వల్ల మధ్యవర్తుల ఒత్తిడితో అనధికారికంగా పిల్లలను దత్తత తీసుకుంటున్నారు. ఇది చట్టప్రకారం నేరం.

దత్తత ద్వారానే చట్టబద్ధత..

కొన్నాళ్లుగా అనాథ పిల్లల దత్తతను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తూ ప్రచారం చేస్తున్నాయి. దత్తత తీసుకోవాలనుకునే ప్రతి ఒక్కరూ కచ్చితంగా కొన్ని నిబంధనలు ఆచరించాల్సి ఉంటుంది. చట్టప్రకారం తీసుకునే దత్తత వల్లే మాత్రమే బిడ్డ తల్లిదండ్రులను అధికారికంగా నమోదు చేసేందుకు వీలుంటుంది. స్కూల్లో చేర్పించాలన్నా, బర్త్ సర్టిఫికెట్ పొందాలన్నా చట్ట ప్రకారం దత్తతను నమోదు చేయాల్సి ఉంటుంది. నోటి మాటగా చేసుకునే దత్తత వల్ల భవిష్యత్‌లో అనేక చట్టపరమైన, న్యాయపరమైన సమస్యలు వస్తాయి. బాలికను దత్తత తీసుకునేటప్పుడు ఉండే నియమాలు, బాలుడిని దత్తత తీసుకునే ముందు పాటించాల్సిన నిబంధనలు వేర్వేరుగా ఉంటాయి.

నిబంధనలు సరళతరం

పిల్లలను దత్తత తీసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తాజాగా నిబంధనల మార్పులతో సులభతరం చేసింది. నెల రోజుల్లోనే దత్తత ప్రక్రియ కొలిక్కి వచ్చేలా ఆదేశాలు జారీ చేసింది. దత్తతకు సంబంధించిన మరింత సమాచారం కోసం అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐసీడీఎస్ అధికారులను, జిల్లా బాలల పరిరక్షణ అధికారులను సంప్రదించి www. cara. nic. in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

దత్తతకు మార్గదర్శకాలు

దత్తత ప్రక్రియకు కేంద్రం కొత్తగా రూపొందించిన మార్గదర్శకాలు ఇలా ఉన్నాయి. ఎవరైనా చట్టబద్ధంగానే దత్తత తీసుకోవాలి. చట్ట విరుద్ధంగా దత్తత తీసుకున్న వారికి 3 నుంచి 7 సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది.

➡ దత్తత తీసుకునే దంపతుల పాన్ కార్డ్, నివాస, ఆదాయ, వయస్సు, వివాహ ధ్రువీకరణ పత్రాలు, దంపతుల ఫొటోలతోపాటు ఆరోగ్య ధ్రువీకరణ పత్రాలు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.

మొదటి దశ: దత్తత పొందాలనుకునే దంపతులు వారి పాన్ కార్డు ద్వారా www. cara. nic. in వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి.

రెండో దశ: వారి లాగిన్ ఐడీ ద్వారా 30 రోజుల్లోపు అప్‌లోడ్ చేసి దత్తత ఏజెన్సీ వారికి గృహ అధ్యయన నివేదిక సమయంలో రూ.6,000 డీడీ రూపంలో సమర్పించాలి.

మూడో దశ: సదరు దత్తత ఏజెన్సీ గృహ అధ్యయన నివేదికను తయారు చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేస్తారు.

నాలుగో దశ: దరఖాస్తుదారు కోరుకున్న బిడ్డను రిఫర్ చేస్తూ వారి మొబైల్‌కు సమాచారం అందుతుంది. 48 గంటల్లోపు వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి బిడ్డ నచ్చితే రిజర్వు చేసుకోవాలి.

ఐదో దశ: రిజర్వ్ చేసుకున్న బిడ్డను 20 రోజుల్లోపు పోలికలు సరిపోల్చుటకు సదరు దత్తత ఏజెన్సీ దగ్గరకు వెళ్లి బిడ్డ నచ్చిందని ఆమోదం తెలియజేసి రూ.50,000 డీడీ అందజేసి బిడ్డను పొందవచ్చు.

ఆరో దశ: బిడ్డను పొందిన వారం రోజుల్లోపు సదరు దత్తత ఏజెన్సీ దత్తతకు సమర్పించిన ధ్రువ పత్రాలన్నింటిని స్థానిక కుటుంబ న్యాయస్థానంలో సమర్పించి కోర్టు ఉత్తర్వులు ప్రతిని పొందాలి.

'కారా' వెబ్‌సైట్ దరఖాస్తుతోనే దత్తత

కేంద్ర ప్రభుత్వం నూతనంగా రూపొందించిన మార్గదర్శకాల ప్రకారం దత్తత పొందడం అతి సులభం. దత్తతకు సంబంధించిన మరింత సమాచారం అంగన్‌వాడీ కేంద్రాల్లో, ఐసీడీఎస్ అధికారులను, జిల్లా బాలల పరిరక్షణ అధికారులను సంప్రదించాలి. దత్తత ప్రక్రియను www. cara. nic. in వెబ్‌సైట్ ద్వారా చేసుకోవాలి. చట్ట విరుద్ధంగా దత్తత తీసుకున్న వారికి 3 నుంచి 7 ఏళ్ల వరకు కఠిన కారాగార శిక్ష, రూ.లక్ష జరిమానా విధించే అవకాశం ఉంది.

– ఒ.ఆనంద్, కలెక్టర్, నెల్లూరు

ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ కమిటీకి దరఖాస్తుల ఆహ్వానం

- కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (అర్బన్): జిల్లాలో వెట్టిచాకిరి నిర్మూలన చట్టం అమలుకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీని ఏర్పాటు చేసేందుకు అర్హత కలిగిన వ్యక్తుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కలెక్టర్ ఆనంద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గం నుంచి ముగ్గురు, సోషల్ వర్క్ సేవలు అందిస్తున్న ఇద్దరిని, గ్రామీణాభివృద్ధికి అనుసంధానించిన ముగ్గురు సభ్యులను అధికార/అనధికార ఏజెన్సీలో నామినేట్ విధానంలో ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తితో పాటు సేవా భావం కలిగిన వారు తమ బయోడేటాతో పాటు పూర్తిచేసిన దరఖాస్తులను ఈ నెల 4 నుంచి 12వ తేదీలోపు పినాకిని గెస్ట్‌హౌస్ పక్కనే ఉన్న జిల్లా ఎస్సీ సంక్షేమం, సాధికారత కార్యాలయంలో పని వేళల్లో అందజేయాలని కోరారు.

క్లుప్తంగా

గుంతను తప్పించబోయి..


• రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



సుప్రజ (ఫైల్)

నెల్లూరు సిటీ: భార్యాభర్తలు స్కూటీపై వెళ్తున్నారు. రోడ్డు మధ్యలో గుంతను తప్పించబోయి ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో భార్య కింద పడింది. అటుగా వెళ్తున్న పొట్టులోడు ట్రాక్టర్ ప్రమాదవశాత్తు ఆమెపైకి ఎక్కడంతో మృతిచెందింది. ఈ విషాదకర ఘటన మంగళవారం జరిగింది. నెల్లూరు రూరల్ పోలీసుల కథనం మేరకు.. పెద్దచెరుకూరు గ్రామానికి చెందిన పెంచల ప్రసాద్ ఓ బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అతని భార్య సుప్రజ (31) ఓ ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా విధులు నిర్వహిస్తోంది. మంగళవారం భార్యాభర్తలు పెద్దచెరుకూరు నుంచి నెల్లూరుకు స్కూటీపై బయలుదేరారు. సుప్రజ వాహనం నడుపుతోంది. ఈ క్రమంలో అల్లీపురం డంపింగ్ యార్డు వద్ద రోడ్డుపై గుంతను తప్పించబోయి ఒక్కసారిగా బ్రేక్‌ను వేసింది. ప్రమాదవశాత్తు ఇద్దరూ కింద పడ్డారు. ఇంతలో వెనుక నుంచి పొట్టు లోడు ట్రాక్టర్ వచ్చి ప్రమాదవశాత్తు సుప్రజపైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతిచెందింది. పెంచల ప్రసాద్ గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గండిపాళెం జలాశయంలో పెరిగిన నీటిమట్టం



ఉదయగిరి: వర్షాల కారణంగా గండిపాళెం జలాశయంలో నీటిమట్టం 14 అడుగులకు చేరిందని ఇరిగేషన్ డీఈ చంద్రమౌళి తెలిపారు. మంగళవారం ఆయన స్థానిక కార్యాలయంలో వివరాలు వెల్లడించారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 35 అడుగులు కాగా డెడ్ స్టోరేజీ 8 అడుగులని తెలిపారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో జలాశయానికి మరికొంత నీరు చేరొచ్చన్నారు. కనీసం 25 అడుగులకు చేరుకుంటే మెట్టపైర్లకు నీరిచ్చే అవకాశముందన్నారు.

నెల్లూరు బ్యారేజీ నుంచి దిగువకు నీటి విడుదల



వర్షం.. కష్టం

• ఎడతెరిపి లేకుండా కురిసిన వాన
• ఎక్కడికక్కడ స్తంభించిన నగరం
• వాహనదారుల అగచాట్లు

నెల్లూరు సిటీ: ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి నెల్లూరు నగరం వణికింది. జనజీవనం స్తంభించిపోయింది. ప్రజలు అడుగు బయట పెట్టలేని పరిస్థితి నెలకొంది. రోజువారీ పనులకు తీవ్ర ఆటంకం ఏర్పడింది. మంగళవారం జిల్లా కేంద్రంలో పరిస్థితి దారుణంగా మారిపోయింది. నెల్లూరులో చెరువు ఉందా.. చెరువులో నెల్లూరుందా అన్నట్లుగా మంగళవారం దృశ్యాలు కనిపించాయి. ముఖ్యంగా ట్రంకురోడ్డులోని సండే మార్కెట్, బృందావనం, హాస్పిటల్ ప్రాంగణం, పొగతోట రోడ్డు వర్షపునీటితో ముంపునకు గురయ్యాయి. ఉదయం పదిగంటల వరకు నగరంలో చిన్నపాటి జల్లులు కురిశాయి. ఆ తర్వాత నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఎడతెరపి లేకుండా వాన పడింది. దీంతో ఎక్కడికక్కడ రోడ్లు నీట మునిగి చెరువులను తలపించాయి. డ్రెయినేజీలు పొంగి పొర్లాయి. దుకాణాల్లోకి నీరు చేరడంతో నిర్వాహకులు అవస్థలు పడ్డారు. ఇక వాన నీటిలో వాహనదారుల సమస్యలైతే వర్ణనాతీతంగా మారాయి. కొన్నిచోట్ల మోకాలి లోతులో నీరు చేరడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో ట్రాఫిక్ పోలీసులు అటుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను ఆపి అందులో ప్రజల్ని ఎక్కించి అవతలకు పంపారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో ఎత్తిపోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వైద్యం కోసం వస్తే..

నగరంలోని పొగతోట, ఎస్2 సినిమా హాల్ రోడ్డు, బృందావనం, సండే మార్కెట్ రోడ్డులో హాస్పిటల్స్ అధికంగా ఉన్నాయి. వర్షం కారణంగా రోగులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. విజయమహల్‌గేట్ ప్రాంతంలో అండర్ బ్రిడ్జిలో నీరు చేరడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనాలను పార్కింగ్ చేసి ఆస్పత్రుల్లోకి వెళ్లిన వారు బయటకు వచ్చి చూసేసరికి నీటిలో ఉండడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అన్ని రోడ్లపై వర్షపునీరు నిలిచిపోవడంతో ఎటువైపు వెళ్లాలో కూడా అర్థం కాని పరిస్థితి. వాహనాలు స్టార్ట్ కాకపోవడంతో మెకానిక్‌లను ఆశ్రయించిన వారెందరో..

ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు



ఆత్మకూరు బస్టాండ్ సమీపంలో అండర్ బ్రిడ్జి వద్ద రాకపోకలు సాగించేందుకు జనం కష్టాలు



ట్రాక్టర్‌లో రోడ్డు దాటిస్తూ..



గొడుగు వేసుకుని వెళ్తూ..



కేవీఆర్ పెట్రోల్ బంకు వద్ద రోడ్డుపై వర్షపునీరు



నెల్లూరు నగరంలో జోరు వాన



వానకు తడవకుండా పెట్రోల్ బంకులో ఆగిన జనం



ట్రంకురోడ్డులో ఇదీ పరిస్థితి



గాంధీబొమ్మ వద్ద ఇలా..



సండే మార్కెట్ వద్ద పాదచారుల కష్టాలు



జేవీ స్ట్రీట్‌లో ప్రధాన రహదారి



సండే మార్కెట్ వద్ద రోడ్డుపై నీరు



విజయమహల్ గేట్ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద ఇలా..



రైల్వే గేట్ వద్ద నిలిచిపోయిన వాహనాలు

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.30
సన్నవి : రూ.20
పండ్లు : రూ.12



వీడని ముసురు

• తుఫాన్ బలహీన పడినా ఆగని వర్షాలు
• అత్యధికంగా ఆత్మకూరులో 110.8 మి.మీ. వర్షం

నెల్లూరు(అర్బన్): ఫెంగల్ తుఫాన్ బలహీనపడినా.. జిల్లాను వారం రోజులుగా ముసురు వీడడం లేదు. సోమవారం రాత్రి నుంచి మంగళవారం వరకు దాదాపు అన్ని మండలాల్లో భారీ వర్షం కురిసింది. బొగ్గేరు, బీరాపేరు, పిల్లాపేరు, బొగ్గుల వాగుల్లో నీటి ప్రవాహం పెరిగింది. ఇప్పటికే 70 శాతం చెరువులు నిండి అలుగులు పారుతున్నాయి. కొన్ని చెరువులు ప్రమాదకర స్థితికి చేరాయి. వానల కారణంగా వరి నాట్లకు ఆటంకం ఏర్పడింది. కొన్నిచోట్ల నారు ముదిరిపోతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

వర్షపాతం ఇలా..

జిల్లాలో మంగళవారం సాయంత్రం 6 గంటల వరకు అత్యధికంగా ఆత్మకూరులో 110.8 మి.మీ. వర్షం కురిసింది. అత్యల్పంగా కావలిలో 5.4 మి.మీ. పడింది. సీతారామపురంలో 99.2, బోగోలు 90.6, అనుమసముద్రంపేట 69.8, సంగం 68.4, వింజమూరు 67.6, ఉదయగిరి 64.8, వరికుంటపాడు 64, దుత్తలూరు 63.6, నెల్లూరు అర్బన్ 63.2, కొండాపురం 57.6, జలదంకి 47.4, అనంతసాగరం 45.2, కొడవలూరు 43.2, వెంకటాచలం 43.2, తోటపల్లి గూడూరు 42.6, చేజర్ల 42.6, పొదలకూరు 39, ముత్తుకూరు 37.2, కోవూరు 34, బుచ్చిరెడ్డిపాళెం 33.6, మర్రిపాడు 30.6, కలిగిరి 29.8, దగదర్తి 29.2, నెల్లూరు రూరల్ 29, లింగసముద్రం 28.4, కలువాయి 27.8, ఇందుకూరుపేట 23, అల్లూరు 25, వలేటివారిపాళెం 22.6, గుడ్లూరు 17.8, కందుకూరు 16.2, సైదాపురం 15.4, మనుబోలు 13.6, ఉలవపాడు 8.6, రాపూరు 8.2, విడవలూరులో 5.8 మి.మీ. వంతున వర్షపాతం నమోదైంది.



సీతారామపురం: సింగారెడ్డిపల్లిలో నేలవాలిన వరిపైరును చూస్తున్న రైతు

నేడూ వర్షాలు

జిల్లాలో బుధవారం కూడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ ప్రకటించింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురుస్తాయని పేర్కొంది. ఇదిలా ఉండగా వచ్చే వారంలో బంగాళాఖాతంలో మరో వాయుగుండం ఏర్పడనుందని అధికారులు ప్రకటించారు. దీంతో మళ్లీ వానలు పుంజుకునే అవకాశముందని తెలుస్తోంది.

మూడువేల ఎకరాల్లో వరినాట్లు మునక

నెల్లూరు(సెంట్రల్): తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు జిల్లాలో సుమారు మూడువేల ఎకరాల్లో వరినాట్లు మునిగినట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి సత్యవాణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 మండలాల్లోని 108 గ్రామాల్లో 1,298 మంది రైతులకు సంబంధించి దాదాపు మూడువేల ఎకరాల్లో పంట మునిగినట్లు వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసినట్లు పేర్కొన్నారు. వర్షం తగ్గుముఖం పడితే తప్ప వాటి పరిస్థితి ఏమిటనేది తెలుస్తోందన్నారు.

మహిళ హత్య కేసులో భర్త, ఇద్దరికి ఏడేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): అదనపుకట్నం కోసం వివాహితపై కిరోసిన్ పోసి చంపి.. ఆత్మహత్యగా చిత్రీకరించిన కేసులో ఆమె భర్త గొల్లపూడి విజయ్‌కృష్ణ, అత్త గొల్లపూడి విజయలక్ష్మి, ఆడపడుచు అర్చనలకు ఏడేళ్ల చొప్పున జైలుశిక్ష విధిస్తూ నెల్లూరు ఎనిమిదో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి జి.గీత మంగళవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా భూషణగుళ్ల గ్రామానికి చెందిన విజయలక్ష్మికి ముత్తుకూరుకు చెందిన గొల్లపూడి విజయ్‌కృష్ణకు 2014లో వివాహమైంది. ఆ సమయంలో కట్న, కానుకల కింద రూ.4 లక్షలు, కొంత బంగారం ఇచ్చారు. పెళ్లి జరిగిన నెలరోజుల తర్వాత అదనపు కట్నం కోసం విజయలక్ష్మిని భర్త, అత్త, ఆడపడుచు వేధించడం ప్రారంభించారు. ఈ విషయాన్ని ఆమె తల్లి గోరిపర్తి వీరకుమారికి చెబుతుండేది. 2016 ఏప్రిల్ 10వ తేదీన విజయలక్ష్మి కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుందనిఆమె పుట్టింటికి సమాచారం చేరింది. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు ముత్తుకూరుకు చేరుకుని అదనపుకట్నం కోసం విజయలక్ష్మిపై కిరోసిన్ పోసి తగులబెట్టారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు విచారించి భర్త, అత్త, ఆడపడుచులపై కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణ అనంతరం న్యాయమూర్తి పైమేరకు తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ ఎం.కె.విజయలక్ష్మి వాదించారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	: 107
లేయర్ (లైవ్)	: 110
బ్రాయిలర్ చికెన్	: 204
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 224
లేయర్ చికెన్	: 187



భర్త చేతిలో భార్య దారుణ హత్య

• బిడ్డ కోసం దంపతుల నడుమ గొడవ
• విచక్షణ కోల్పోయి కత్తితో దాడి



ఇందిర మృతదేహం



ఇందిర కుటుంబం (ఫైల్)

ఉదయగిరి: కన్నబిడ్డ కోసం జరిగిన గొడవలో విచక్షణ కోల్పోయిన భర్త భార్యను అతి దారుణంగా కత్తితో పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన ఉదయగిరిలోని ఎస్టీ కాలనీలో మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు, సమీప బంధువుల కథనం మేరకు.. ఉదయగిరిలోని కావలి రోడ్డులో ఉన్న ఎస్టీకాలనీకి చెందిన కట్టా మస్తాన్‌కు మూడేళ్ల క్రితం అదే కాలనీకి చెందిన ఇందిర (20) అలియాస్ ఇందూతో వివాహం జరిగింది. వీరికి రాణా అనే రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యపై అనుమానం పెంచుకున్న మస్తాన్ తరచూ గొడవ పడేవాడు. పైగా అతని మానసిక స్థితి కూడా సరిగా ఉండేది కాదని స్థానికులు చెబుతున్నారు. ఇందిరను నిత్యం వేధిస్తూ కొట్టేవాడు. విసిగిపోయిన ఆమె మూడు నెలల క్రితం కుమారుడిని తీసుకుని పుట్టింటికి వెళ్లింది. బిడ్డను తనకివ్వాలని మస్తాన్ పలుమార్లు భార్యపై ఒత్తిడి తెచ్చినా ఇవ్వలేదు. మంగళవారం ఇందిర తన తల్లి లక్ష్మమ్మకు చెందిన మేకల్ని మేపేందుకు కాలనీ సమీపంలో ఉన్న అటవీ ప్రాంతానికి వెళ్లింది. అక్కడికి మస్తాన్ వెళ్లగా భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. అక్కడున్న వారు సర్దిచెప్పి ఇంటికి పంపారు. సాయంత్రం మస్తాన్ అత్తింటి వద్దకు వెళ్లాడు. రాణాను తీసుకెళ్లి తన తల్లి పోలమ్మ దగ్గర ఉంచాడు. ఎంత సేపటికీ మనుమడిని తిరిగి పంపకపోవడంతో లక్ష్మమ్మ పోలమ్మ ఇంటికి వెళ్లింది. పిల్లాడిని ఇవ్వాలని అడగ్గా అల్లుడు స్పందించకపోవడంతో ఈ విషయాన్ని ఇంట్లో ఇందిరకు చెప్పింది. ఆమె మరో మహిళతో కలిసి భర్త దగ్గరకు వెళ్లి బిడ్డను ఇవ్వాలని అడిగిన క్రమంలో వారి మధ్య గొడవ జరిగింది. ఊయల్లో ఉన్న బిడ్డను తీసుకునేందుకు ఇందిర ప్రయత్నం చేస్తుండగా కత్తితో మస్తాన్ భార్యపై దాడి చేశాడు. ఆమె తప్పించుకునేందుకు ప్రయత్నించగా వీపుపై రెండుసార్లు పొడిచాడు. ఇందిర కుప్పకూలగా స్థానికులు ఆటోలో ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మృతిచెందింది. మస్తాన్ పరారీలో ఉన్నాడు. ఘటనా స్థలాన్ని సీఐ ఎన్.వెంకట్రావ్, ఎస్సై కె.ఇంద్రసేనారెడ్డి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి సంఘం ఎన్నికలు వాయిదా

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఈ నెల 5వ తేదీన నిర్వహించాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలు వాయిదా వేస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు కలెక్టర్‌కు సమాచారం అందించినట్లు విశ్వసనీయ సమాచారం. తుఫాన్, భారీ వర్షాల కారణంగా ఈ ఎన్నికలను వాయిదా వేస్తున్నట్లు, తదుపరి నోటిఫికేషన్ జారీ తేదీని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపింది.

సెలవుపై వెళ్లిన రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ

నెల్లూరు సిటీ: జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ డీఐజీ (డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్) కిరణ్‌కుమార్ మంగళవారం నుంచి రెండువారాలపాటు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో ఇన్‌చార్జి డీఐజీగా కడప డీఐజీ వీఎస్ఆర్ ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు.